


“గాలీ వానా వస్తే కథే లేదు” ఈ సామెత అన్ని సందర్భాలలోనూ నిజం కాకపోవచ్చును. తరువాత ఆ ‘కథ’ హరికథ అయివుండవచ్చును గాలీ వానా రాబట్టే, యీ కథ!

గాలీ వానా వచ్చింది.

వంతెన కొట్టుకుపోయింది

నిషాలో- కారులో ఉన్న రాజావారికి- లేని వంతెన ఉన్నట్లుగా తోచింది.

ఫలితం—కారూ, రాజుగారూ కాల గర్భంలో కలసిపోయారు రాజుగారంటే ఛెయిర్మన్ మా వూరి పురపాలక సంఘానికి నిజంగా మహారాజే ఆయన.

రాజ్యం అరాచకం కాకుండా, గద్దె బోసిపోకుండా, ప్రజలు అనాధలు కాకుండా—ఎలక్షన్లు వచ్చేయి

హడావిడంతా నిజానికి మాదే కారణం చనిపోయిన ఛెయిర్మనుగారు మా వార్డు కౌన్సిలరు

కౌన్సిలర్ ఎన్నిక వరకూ సందడి వార్డు ప్రజలది

ఛెయిర్మన్ ఎన్నిక పండుగంతా కౌన్సిలర్లది ప్రస్తుతం యీ దేశంలో ఏ ఎన్నిక స్వచ్ఛంగా జరుగుతూంది కనుక యిది కూడా సజావుగా జరుగుతుందని మనసును మభ్యపెట్టుకుందుకు?

ఎన్నికలకు పోటీ చేస్తున్న అభ్యర్థులు తోలుబొమ్మలు

పార్టీలు—వాటికి కట్టబడిన సూత్రాలు. ఈ దారాలను పట్టుకుని తాము తెర వెనుక ఉండి బొమ్మల నాడిస్తూంటారు. అసలు పెద్దమనుషులు మామూలుగా ఉండే పార్టీలకు తోడు. మా వూళ్ళో కులాలు కూడా బలమైన శక్తులే పలుకు బడిలోనూ ఐశ్వర్యంలోనూ పోటీ పడేవి రెండే రెండు కులాలు అవకాశం రావాలే కాని తమ ఆధిక్యత నిరూపించుకోవాలని అవి ప్రయత్నించక మానవు కాలేజి కర స్పాండెంట్ మొదలు కౌన్సిలర్ వరకూ దేనికైనా రెండు కులాలూ పోటీ చేస్తూనే ఉంటాయి కనుక ఏ యెన్నికయినా రంజు గానే ఉంటుంది మా వూళ్ళో

అలవాటుగానే యిద్దరభ్యర్థులు పోటీ చేస్తున్నారు

ఎలక్షన్లింకా ఎక్కడ అనిపించి నన్నాళ్ళు అభ్యర్థులు మీ ఓటు మాకే అంటూ బోర్డులు పట్టుకు తిరిగేవారు. జరిగే ఎలక్షన్ మా వాడ్డకే పరిమితమైనా వూళ్లో ప్రాసాదాల ప్రహరీగోడలు మొదలు పాకీ దొడ్ల గోడల వరకూ అన్నిటి మీదా తమ గుర్తులూ, నామధేయాలూ ఓట్లకొరకు ప్రార్థనలూ నింపి వాటిని ఖరాబు చేసేశా రిక ఎందుకూ చోటు మిగలకుండా

ప్రొసెషన్లు సాగించారు

కాఫీహోటళ్ళ ముందరా, కిళ్ళీకొట్ల ముందరా చిన్న యెత్తున ఉపన్యాసాలు పెట్టేవారు సోప్ బాక్స్ ఆరేటర్స్ మల్లె.

తెలిసిన వారికీ (ఎందుకయినా మంచి దని) తెలియని వారికీ తమను తాము పరిచయం గావించుకోసాగారు

అభ్యర్థు లిద్దరూ ఎవరికి వారే తానే ఏకైక ప్రజాసేవకుడినని నొక్కి వక్కా ణించుకోసాగారు సిసలైన ప్రజాసేవకుల పోజులు, డైలాగులు వారికి కరతలా మలకమై పోయాయ్

ప్రజాసేవయే తన ఊపిరని ఒకరంటే. తను ప్రజాసేవకోసమే జన్మించాననీ, అది తప్ప తన కింకేమీ చేతకాదనీ రెండవవారు చెప్పుకోసాగారు ప్రజలిటువంటి మాటలు నమ్మరని వారికి తెలిసినట్లే-అవునన్న ఓటర్ని కూడా ఒకటికి పదిసార్లు అదనంగా హెచ్చరికలు చేశారు


ఎలక్షన్లు దగ్గర పడుతున్నయ్.

అభ్యర్థులకు ఆత్మవిశ్వాసమే తగ్గి పోయిందో లేక ప్రజల మీద విశ్వాసమే తగ్గిపోయిందో కాని ఎలక్షన్ కార్య క్రమాలు ఉధృతం చేయసాగారు

బంధుత్వాలు తిరగదోడటంలో, స్నేహాలు కలుపుకోవడంలో ఒకరి కొకరు సమఉజ్జీలమని నిరూపించుకుంటున్నారు ఉభయులూ

ఎన్నికల గోదాలోకి ప్రత్యక్షంగా దిగక పోయినా తెరచాటు వ్యవహారాల కుస్తీ పోటీలలో వూరి పెద్దమనుషులందరూ మల్లా గుల్లా లౌతున్నారు.

మా వూరి మనుషుల మెంటాలిటీ విచిత్రమైనది తాము ఓడిపోయినందుకు




కలిగే బాధకంటే ప్రతిపక్షం వాళ్ళ గెలుపే ఎక్కువ బాధాకరంగా పరిణమిస్తుంది. అందుచేత-తాము గెలవడం కంటె ఎదుటి వాడు ఓడిపోవడం పట్ల పట్టుదల హెచ్చు మా వూరి వారికి. వూళ్ళో డాక్టర్లు— మా వార్డుకి తరచుగా వచ్చి విజిటింగ్ ఫీస్ లేకుండానే పేషంట్లను పలకరించి వెడుతున్నారు. రెండుపూటలా వాళ్ళ మంచి చెడ్డలూ, ఓట్లూ అడిగివెళ్తున్నారు.

లాయర్లు క్లయింట్ల యిళ్లకే వెళ్తున్నారు! టీచర్లు కూడా ఉడతా భక్తిగా— పిల్లల యిళ్ళకు వెళ్ళి వాళ్ళ పెద్దలను ప్రాధేయపడుతున్నారు ఓట్ల కోసం.

ఎలక్షన్లు మరీ దగ్గర పడ్డాయి.

పువ్వు గుర్తు అభ్యర్థి తాలూకు ఆడవాళ్లు వార్డులో అందరాడవాళ్ళకీ మొదట నిజం పువ్వులు పంచిపెట్టారు. తరువాత కాగితపు పూవులు పంచిపెట్టారు. ఆ తరువాత ప్లాస్టిక్ పూలూ, ఆ తరువాత పూల కుండీలూ, పూల డిజైన్లున్న రవికెల గుడ్డలూ పంచిపెట్టారు.

పువ్వు గుర్తు అభ్యర్థి కోటుకి పావు గంట కొకటి చొప్పున పువ్వులు మారుతున్నాయి. భవిష్యత్తులో అత నెంత త్వరగా రంగులు మార్చే ప్రతిభ కలవాడో ముందే చెప్తున్నట్లు.

పగలూ రాత్రీ సినిమా వరసలలో ఓట్ల పాటలు వినిపిస్తున్నయ్. ఓట్ల పాట్లు కనిపిస్తున్నయ్. అభ్యర్థులు ఓటు జపం చేస్తూ తమవారి ఓట్లను లెక్కించుకుంటున్నారు రుద్రాక్షమాలలో పూసలను లెక్కించే దొంగ భక్తుడిలా.

ఎక్కడ చూసినా ఓటు నామస్మరణ.

ఎలక్షన్ ఫీవర్ ఎక్కువై పోతూంది.

అభ్యర్థులూ మద్దతుదారులూ మల్లా గుల్లాలైపోతున్నారు

మార్కెట్‌లో పువ్వులు మచ్చుకి కన పడటం లేదు అక్కడక్కడ పువ్వుల చీరెలు కూడా పంచి పెడుతున్నట్లు గాలి వార్తలు

మగవాళ్ళకి ఆడళవ్వాళ మీద అసూయగా ఉంది. అభ్యర్థి పువ్వు గుర్తు కాకుండా టెరిలిన్ చొక్కా గుర్తు పెట్టుకుంటే బాంగుండేదని మనసులో అతని మీద కోపం తెచ్చుకుంటున్నారు కొందరు మగ వాళ్లు. కనీసం పెన్ను గుర్తయినా కొంత నయం అనుకున్నారు కొందరు మొగవాళ్ళు

రెండవ అభ్యర్థి గుర్తు ఎద్దు

ఎడ్లని పంచిపెడతారేమో అని యెదురు చూశారు ప్రజలు. కనీసం నాగళ్ళయినా యివ్వరా అని ఆశపడ్డారు ఎద్దేమిటి నాన్సెన్స్ సైకిలో స్కూటరో పెట్టుకుని ఓటర్లకు స్కూటర్లు పంచిపెట్టవలసిందని వాపోయారు విద్యాధిక ఓటర్లు

ఏ రోజు రావడానికైనా ఎదురు చూసి నంతసేపు పట్టదనిపిస్తుంది ఆ రోజు వచ్చాక

తెల్లవారితే ఎలక్షన్లు

ఎద్దు గుర్తు తరపున—వీధి పెద్దలకీ, కులపెద్దలకీ, ఛోటా లీడర్లకీ పులిబుర్రలూ గాంధీ బుర్రలూ (వందరూపాయల నోట్లు) అందాయని వదంతి పువ్వు గుర్తువాళ్ళు టెరిలిన్ చీరలూ గట్రా అందించారని అవతలి వర్గం లేవదీసిన వదంతులు.

నోట్లు చల్లేది ఓట్లు (గింజలు కావు) పండుతాయని పులిబుర్ర లందుకున్న పెద్ద మనుషులకుండేవి ఒక్క ఓటూ, రెండు చేతులూ అయినా ఆ చేతుల కింద ఎన్నో చేతులుంటాయనీ, ఆ మనుషులందరూ తమ పెద్ద చెప్పిన వారికే ఓటు వేస్తారనీ.


పవిత్ర భారతదేశంలో సామాన్యులు ఓట్లు కూడా త్యాగం చేస్తారు

ఏవేవి ఎలక్షన్లదృష్ట్యా నిషేధాలో అవన్నీ ఒక్కటీ మరచిపోకుండా అమలు జరపబడిన అనంతరం ఆ రాత్రి తెల్ల వారింది

యుద్ధసన్నాహాలు ముగిసి ప్రత్యక్ష రణరంగం ఆరంభమైంది ఇక గొరిల్లా ముట్టడికి స్వస్తి చెప్పి బాహాటంగానే పోట్లాడుకోసాగారు అభ్యర్థులు ప్రజలనబడే దళాన్ని వినియోగించుకుంటూ

[పాఠకులు రచయితను మన్నించాలి ఇంతవరకూ చెప్పింది కథ కాదు పూర్వ రంగం ఇక చెప్పబోయేదే అసలు కథ అందులో రచయిత కూడా పాత్రధారుడు కావలసివస్తోంది

షరా —కథకు క్లుప్తత అవసరం కనుక—పువ్వు గుర్తు మనుషులకు బదులు 'పువ్వు' అనీ, ఎద్దు గుర్తు మనుషులకు 'ఎద్దు' అనీ ఉదహరిస్తాను అన్నీ మన్నిం చండి ]




సెంటర్లో నిలబడ్డాను — ఎన్నికల చోద్యం చూస్తూ ఇంతవరకూ అభ్యర్థులు చేసిన సేద్యం ఎలా ఫలిస్తుందో అన్న ఆత్రుత నాకు లేకపోలేదు

నా కంతా తమాషాగా వుంది.

నాకు అదృష్టవశాత్తూ ఓటులేదు కనుక స్వేచ్ఛ వుంది

ఎదురుగా పోలింగ్ బూతుంది

నా ముందు రిక్షా ఆగింది

అందులోంచి ఓ ముసలమ్మా, కుర్రాడూ దిగారు.

నలుగురూ చుట్టుముట్టేశారు వాళ్ళిద్దరినీ గుంపు మూలంగా దృశ్యం అస్పష్టమై పోయింది కొన్ని క్షణాల అనంతరం పువ్వు గుర్తులు కల నలుగురు, ముసలమ్మనూ కుర్రాణ్ణీ చిక్కించుకున్నారు. (ఈ ప్రయోగం నిజం)

ముసలమ్మకి ముందొకడు, వెనుక ఒకడు అటూ ఇటూ చెరొకరు కాలేజీ అమ్మాయికి మల్లె నాలుగువైపులా బాడీ గార్డ్స్

గ్రెద్ద వచ్చి ఎక్కడ తన్నుకుపోతుందో అని చిన్నపిల్లడు చొక్కాకింద మిఠాయి పొట్లం దాచి భద్రంగా అడుగులు వేసేటట్లు గానే, కొన్ని రవాణా సంస్థలు భద్రతను బొమ్మలు వేసి చూపేటట్లు—పువ్వులు నలుగురూ ముసలమ్మను ఎడ్ల బారిన పడకుండా కంటికి రెప్పలా కాపాడుతూ

పోలింగ్‌బూత్ వంక దారి తీయబోయారు. కాని

"ఆగండి బాబులూ అడుగు తీసి అడుగెయ్యలేక పోతున్నాను" అంది అవ్వ

"ఏం అవ్వా?" తనవాళ్ళు అటూ ఇటూ అన్నట్లుంటే ఆత్మీయులు ఆత్రుత పడే టట్లుగా పువ్వులు నాలుగూ కలవరపడి పోతూ అడిగారు

"కూడు తిననివ్వకుండా రెక్కట్టు కీడ్చుకొచ్చి రిక్షాలో కుదేసినారు ఓటెయ్యా లని ఆకలి కడుపు మండిపోతది కుర్ర నాయాలికి. వొటేలుకి పోదాం పదండి బాబులూ మీరూ ఎప్పుడు తిన్నారో యేటో"

తప్పదన్నట్లు అవ్వనూ, కుర్రాణ్ణీ హోటల్‌కి నడిపించారు నలుగురూ. నేనూ కదిలాను

"ఇడ్లీ తింటావా అవ్వా? రెండు చెప్పేదా?" అడిగాడొక పువ్వు

అతని మాటలు వినకుండానే "స్పెషలే టుంది? పత్రూ" అందవ్వ సర్వర్‌ని చూస్తూ

పువ్వులు తెల్లబోయి తమాయించు కున్నాయి. అవ్వా మనవడూ వెజిటబుల్ పులావ్ తిన్నారు.

"కాఫీ చెప్పేదా అవ్వా?"

"నోరంతా మంట స్వీటేటుందో?"

స్వీటు వచ్చి—మాయమైంది.

"మసాలాదోసె రోష్టుగా కాల్చి తీసుకురా"

అదీ అయింది

"కారప్పొడుంటే యిడ్లీ తే" ఆర్డ రిచ్చిందవ్వ

"కారప్పొడి లేదు—" చెప్పాడు సర్వరు

"సాంబారుందిగా? సాంబారులో రెండిడ్లీ వేసి తే" అది పుచ్చుకున్నాక —ఆకలీ, ఆత్మా శాంతించినట్లు బ్రేవ్‌మని త్రేన్చిందవ్వ

వృద్ధురాలి జఠరాగ్ని నా కాశ్చర్యంగానే వుంది

"కాఫీ తాగవు కదూ అవ్వా?"

"ముసిలిముండని నాకు కాఫీ దేనికి బాబులూ? కూల్‌డ్రింక్ తెప్పించు కడుపు చల్లగా వుంటది"


కౌంటర్ దగ్గర గలాటా జరగ బోయింది ఎద్దు గుర్తు వాడొకడు ఎడ్వాన్సుగా అవ్వ బిల్లు ఇచ్చేసి నిలుచున్నా డక్కడ

అలా వీల్లేదు,బిల్లిచ్చినవాడే డబ్బు లివ్వ డాని కర్హుడని పువ్వులు ముఖా లెర్ర జేశాయి

కొన్నిక్షణాలైతే పువ్వులూ ఎడ్లూ కొట్టుకోబోయే వారే కాని—

'ఎద్దు' వంక చూసి ఏదో చెప్తున్నట్లు నవ్విందవ్వ

కలహం సమసిపోయింది.




హోటల్ గడపదాటేసరికి. ఒక 'ఎద్దు' కారాకిళ్ళీ తెచ్చి అవ్వకిచ్చేశాడు పువ్వులు వారించబోయాయ్ ఆ పువ్వుల గుండెల్లో ముళ్ళు గ్రుచ్చుకున్నట్లయింది కాబోలు దీనంగా అవ్వ వంక చూశారు

"కుర్రాడికి బిస్కత్తులు మీరు కొనండి—" మందహాసం చిందిస్తూ— బోసినోటితో వరమిచ్చినట్లే అందవ్వ పువ్వుల ముఖాలలోకి పరికించి చూస్తూ

పువ్వుల గుండెలు కుదుటపడ్డాయి.

ఎద్దుల గుండెలు మండిపోయాయ్.

"అవ్వా నిన్న రాత్రి.." తొందర పడబోయాడొక ఎద్దు.

"వొళ్ల కోరా నాకు తెల్దేటా పాటి?" ప్రేమగా కసిరింది

"నీ వోటు మాకే అవ్వా పువ్వుకే నీ వోటు" పువ్వుల విలాపం

. "పిచ్చి సన్నాసులూ ఆ పాటి తెల్దేట్రా నాకు?" లాలనగా చిరాకు పడింది

పోలింగ్ బూత్ దగ్గరపడింది

ఓటర్లు కాని వారు సరిహద్దు దగ్గర నిలిపివేయ బడుతున్నారు అభ్యర్థుల మనుషులు (పువ్వులూ, ఎడ్లూ) ఓటర్లకు వెయ్యి విధాల చెప్పి సాగనంపుతున్నారు. వినగలిగితే—అక్కడ వేలకొలదీ వాగ్దా నాలు లక్షలకొలదీ ఆశలు.

"అవ్వా, పువ్వు"

"అవ్వా, ఎద్దు."

నడచి వెళ్తున్న అవ్వ ఒక్కసారి తిరిగి చూసి ఒక్క మందహాసం చిందించింది ఇద్దరినీ సమానంగా పంచుకోమన్నట్లు

లోపలకు వెళ్ళిన అవ్వ వచ్చేవరకూ నేనూ నిలుచున్నాను రోడ్డు మీద ఆమె వచ్చాక ఆమె ననుసరించ సాగాను

"ఎవరికి వేశావవ్వా?" పువ్వు గుర్తు పలకరింపు అవ్వ పెద్ద నవ్వు నవ్వింది— ఓరి అమాయకుడా అన్నట్లు

"మాకే వేశావా అవ్వా?"

మళ్ళీ అదే నవ్వు పువ్వుకీ ఎద్దుకీ అవ్వ నుంచి సమాధానం అదే నవ్వు

రిక్షా లేదు కాబోలు నడుస్తోందవ్వ

"బాగున్నావా అవ్వా?" కదిపాను మెల్లగా

"ఓటేసేసినాను బాబులూ, ఇక నా సంగతెందుకు తమకి?"

"ఓట్ల మనిషినిగానవ్వా."

"మరి నా యెంట పడతావేం?"

"నాదీ మీ వీధే రిక్షాలో వచ్చినట్లు న్నావ్ నడిచి వెళ్తున్నావేం?"

"ఆ బోగం అయిపోనాది ఓటెయ్య డానికంటే రిక్షాలేటి, కార్లన్నా తెప్పిస్తారు తిరిగెళ్ళేటప్పుడు ముఖం చూసే ముండా కొడుకెవడు?" ఎండలో నడుస్తూందేమో అవ్వ ఎండలాగే చిరచిర లాడుతోంది

"ఇంతకీ ఓటెవరికేశావవ్వా?!" మెల్లగా అడిగాను. అనుమానంగా చూసిందవ్వ. "గుడిమింగే వాడొకడు, గుళ్ళో లింగం మింగేవా డింకోడు రెండూ గుడ్డి కళ్ళే అయితే ఏది కోరుకుంటే ఏటొరిగింది?

"ఇద్దరూ తెలిసినోళ్ళే రాత్రికి రాత్రి ఎద్దులోడొచ్చి ఓటిమ్మని అయిదు రూపా యలు చేత బెట్టాడు కాదనలేక పోయాను మనవాడేకదాని తెల్లారకుండా పువ్వులోడు తయారై ఓటిస్తేగాని వొల్లకాదన్నాడు సేరు బియ్యం, మూడ్రూపాయలూ యిసి రేసి పోనాడు వొద్దన్నా వినకుండా అదే రిక్షా తీసుకొచ్చినాడు హోటల్లో నాకూ పిల్లడికీ ఆకలితీరేలా టిపినెట్టించినాడు

"ఎవరి అభిమానాన్ని కాదనేది?

"అయినా—మనసు ప్రదానం కానీ ఓటుకేటుంది బాబూ ఒట్టి కాగితంముక్క. అందులోనూ నా నెన్నో ఎలచ్చన్లు చూసి నాను ఈ చిన్న ఎలచ్చన్లలో ప్రాణానికి హైరాణాయే తప్ప పెద్ద లాభముండదు బాబూ ఇంతా జేస్తే కిట్టిందేపాటి? అడో అయిదూ, యీడూ మూడూ యిదే పెద్ద లచ్చన్లతేనా, అదమపచ్చం పచ్చనోటు కళ్ళ జూసేదాన్ని లేకపోతే గడిప దిగే దాన్నా!

"పెద్దెలచ్చన్లెప్పుడు బాబూ?"

"చాలాకాలం వుంది"

"నేను బతికుంటానా బాబూ అప్పటికి? ఏటో ఆటితీరూ, ఆ అడావిడీ అదంతా పెద్దలెఖ్క ఓటేసినా మంటే నెల్లాళ్ళు రాజాలాగెళ్తుంది

ఇయేటి బాబూ. .బొత్తిగా అల్పం"

ఇక నాకు నోరు పెగలలేదు

అడుగు ముందుకు పడక ఆగి పోయాను.